# ది లేస్ట్ జడ్జిమెంట్

చిట్టిబాబు స్కూలు నుండి యింటికెళ్ళేదోవలో, మెయిన్ రోడ్డు మీద "కరాచీ నేతి మిఠాయి" షాపు వుంది. ఎక్కడో పాకిస్తాన్‌లో వున్న కరాచీకి, ఆ మిటాయిలకు సంబంధం ఏమిటో ఎవరికీ తెలియదు. కాని ఆ షాపు ప్రాంతాలకు రాగానే మురికి వాసనపోయి తినుబండారాల వాసన కమ్మగా ముక్కుకు తగుల్తుంది.

అందుచేత, కాపురానికి పోగానే కడుపొచ్చిన యువతిలా, ఆ కొట్టు ఎప్పుడూ కళకళ లాడుతూ వుంటుంది. సాయంకాలం అయ్యేసరికి సాని దానిలా అలంకరించుకొని దారిన పోయే వాళ్ళను ఆకర్షిస్తుంటుంది.

చిట్టిబాబుకు మిటాయిలంటే యిష్టం. చాలా రోజుల క్రితం ఎవరో చుట్టాలు యింటికొస్తూ తెచ్చినమిఠాయిలు యీకొట్లోనివేనని చెప్పేరు. వాటి రుచి చిట్టిబాబుకు యింకా గుర్తుంది. ఎలాగైనా, ఎప్పటికైనా ఆ కొట్లో మిటాయిలు బోలెడుకొని అక్కలు, చెల్లెళ్ళతో కల్పి తినాలని అతనికోరిక!

కానీ యీకోరిక తాను పెద్దయిందాకా తీరేది కాదని అతనికి తెల్సు. అతని తండ్రి డ్రైవరు. అయిదుగురు పిల్లలకు రెండు పూటలా కడుపు నిండా అన్నం పెట్టటానికే అతను కటకట లాడిపోతుంటాడు.

అటు యిద్దరు యిటు యిద్దరు ఆడ పిల్లల తర్వాత పుట్టిన వొకే వొక్క కొడుకైనా, చిట్టిబాబు చిన్నతనం నుంచి గారాబాలు తిని పెరగ

లేదు. బాధ్యతలను, బరువుల్ని గ్రహిస్తూ పెరిగాడు.

అందుకే కరాచీ నేతి మిఠాయి షాపు అల్లంత దూరంలో వుందన గానే చిట్టిబాబు ప్రాణాయామం పట్టి మొహం అవతలకు తిప్పుకొని పోతుంటాడు ఎప్పుడూ. కానీ ఆ వేళ అలా కుదరలేదు.

అడుక్కునే కుర్రాదొకడు, కొట్లో నుంచి వస్తువులు కొనుక్కొని పోయే వాళ్ళ కాళ్ళకి అడ్డం పడుతున్నాడు. కొత్తకొత్త స్లోగన్లతో అడుక్కుంటున్నాడు. మిఠాయి అడుక్కోడం తన హక్కన్నట్లు నిలేసి మాట్లాడుతున్నాడు.

"బాబూ ! బలహీన వర్గంవాడిని. అప్పులిచ్చినా యాపారం సేయలేను. మీరు తినేదాంటో బాగమిచ్చి నా ఆకల్ని సంపండి"

"అన్నం తిన్నవాళ్ళు కూడా మిటాయి ఎందుకు తింటారు బాబూ? అందుకే అన్నం పొద్దున, మిటాయి సాయంత్రం అడుక్కొంటున్నా. ముట్టోళ్ళు మిటాయిలు తిన కూడదని ఏడుంది బాబూ ?"

"బాబ్బాబు ! ఆకలికి, రుచికి పేదోళ్ళు, ధనవంతులన్న తారతమ్మెం లేదుబాబూ ! మీరు తినేదాన్లో వో ముక్క పారేయండి."

యీ ఘరానా ముష్టి వాడిని చూడటానికి జనం మూగేరు. ఎందరు ఎన్ని విధాల చెప్పినా ముష్టివాడు మాత్రం తన పద్ధతి మానలేదు. చూచే జనానికి విసిగిపోయింది. కాని, అతడికి మాత్రం అలుపు రాలేదు.

అందరితోపాటు అడుక్కొనే కుర్రాడిని చూడటానికి తల తిప్పిన చిట్టిబాబు కళ్ళు అద్దాల బీరువాల్లో వస్తువులపైకి పోయాయి అంతే ! ఎంత సేపు అలా నిలబడ్డాడో తెలియదు. యింతలో అడుక్కునే కుర్రాడు చిట్టిబాబు పక్కకొచ్చాడు. పుట్‌పాత్ మీద ఎత్తుగా వున్న వో దిమ్మెపైన రాజులా ఠీవిగా కూర్చున్నాడు. అడుక్కొన్న పదార్థాలని లొట్టలేసుకుంటూ తిన సాగేడు.

"దొంగ నాయాళ్ళు ! గంజి మా మొగాన పోసి, రుసి రుసిగా యిట్టాటివి రోజూ మెక్కుతుంటారు కాబోలు! ఏం? మాకుమాత్తరం యివి తినే హక్కునేదా ? మేం మనుసులం కామా ?"

చిట్టిబాబు అడుక్కొనే కుర్రాడివైపు అదో విధంగా చూచాడు.

"గ్రెస్ స్టాకునాగుంది. గుమగుమ లాడుతున్నాయ్. రుసి సూత్తా వేంటి ?"

చిట్టిబాబుకు నిజంగానే నోరూరింది. మనసు వోక్షణం చలించింది. అంతలోనే గుండెలకు ఆనుకొని వున్న పుస్తకాలు చిట్టిబాబు మనసు లాగి వో తన్ను తన్నాయి.

ముష్టి ఎత్తుకొనేది అవిటివాళ్ళు, సోమరులు. తను రెండూ కాదు. కాకూడదు. బాగా చదువుకొని నాన్న ఆశల్ని తీర్చాలి. చిట్టిబాబుకు తండ్రి గుర్తుకొచ్చాడు. తనంటే ఎంత ప్రేమ ! డబ్బులేక కాని, వుంటే యిలాంటి మిఠాయిల్ని ఎన్ని కొనిపెట్టడు ?

చిన్నతనపు జిహ్వాచాపల్యాన్ని అలా సమాధాన పర్చుకొని, పుస్తకాలని జాగ్రత్తగా గుండెలకి పొదువుకొని ముందుకు నడిచాడు.

ఎదురుగ్గా రోడ్డుమీద వో రిక్షా వస్తోంది. రిక్షాలో బుట్టలు, బుట్టల్లో రకరకాల స్వీట్లు. బుట్టల మధ్య లావుపాటి వో శాల్తీ.

చిట్టిబాబు చూస్తూండగానే రిక్షాలోని లడ్డూల బుట్ట కిందపడింది. పంక్చర్ పడ్డ బెలూనుల్లాగా చాలాలడ్లు రోడ్డుకు కరుచుకుపోయాయి. కొన్ని లడ్లు బంతుల్లా దొర్లుకొంటూ రోడ్డుమీద అటూయిటూ అల్లిబిల్లీ ఆటలోలా పరుగులెత్తేయి. అలా పరుగెత్తిన వో లడ్డు రోడ్డుకు అవతలపక్కన వో చిన్న గుంటలోపడి ఆగింది.

ఆకాశంలోనుంచి ఆశ, ఆకలి వూడిపడింది రోడ్డుమీద. పేవ్‌మెంట్ మనుష్యులు రోడ్డు పైన పడ్డారు. కిందపడ్డ బూందీ మీదికి ఎగబడ్డారు.

ట్రాఫిక్ ఆగిపోయింది. తెల్లగుడ్డల బాబులు నిలబడిపోయి చిత్రం చూస్తున్నారు.

రిక్షాలో స్వీట్లశాస్త్రీ సైరన్‌లా అరిచేడు.

"బాబోయ్! బెగ్గర్ నాయాళ్ళు నా సొమ్ము కుక్కల్లా మెక్కుతోన్నారు. బాబోయ్! మీ పున్నెం వుంటుంది. కాపాడండి నాయనోయ్ ..."

తెల్ల బట్టల బాబుల హృదయాలు ఆ దీనాలాపాలకి కరిగి నీరయ్యాయి. కార్య రంగంలోకి దూకేరు. ముష్టివాళ్ళను కుక్కల్లా, కాకుల్లా రోడ్డుపైనుంచి తోలి సారేసేరు. నేలపాలయిందనుకొన్న సొమ్ము ధూళితో కల్సి మళ్ళీ బుట్టల్లోకెక్కి ప్రయాణం ప్రారంభించింది.

యింత జరిగినా రోడ్డు కవతల ఆగిన లడ్డును ఎవరూ చూడలేదు. అదింకా అలాగే చిట్టిబాబు నోరూరిస్తూవుంది. రమ్మని పిలుస్తోంది.

అతని ఆలోచనల్ని, యుక్తాయుక్త వివేచనను - ఆశ, కోరిక, జిహ్వాచాపల్యం, అన్నీ కల్సివెళ్ళి చంపేసేయి. ఉన్నట్లుండి ఎవరో వెనకనుంచి బలంగా నెట్టున్నట్లు చిట్టిబాబు రోడ్డుకు అడ్డంగా పరుగెత్తేడు!

* * *

సాయంకాలం సినిమా వ్యామోహం జనాన్ని తినేసేవేళ.

సిటీ బస్సులు పుష్పక విమానాలుగా రూపాంతరం చెందేయి. ఎక్కటానికి ఎంతైనా చోటుందిలోపల. దిగాలంటేనే ట్రబుల్. కండక్టర్ మాటలతో నేర్పుగా కాంక్రీటు గోడల్ని కడుతున్నాడు.

ఎనిమిదో నెంబరు బస్సు వచ్చి ఆ సెంటర్లో ఆగింది. డ్రైవరు కనకారావు మరో మాటు రోడ్డు వైపు చూచి, గర్వంగా జేబులో నుంచి బీడీ తీసి ముట్టించాడు.

కనకారావు చూసింది పదో నెంబరు రూటు వైపు.

ఆ వూరికి ఆ సెంటరు మెదడు లాంటిది. ఏ రూటు బస్సయినా

అక్కడికి వచ్చి తీరాల్సిందే. ఎనిమిది, పదో నెంబరు బస్సులు రెండు భిన్న మార్గాలనుంచి ఆ సెంటరుకు వొకేసారి వచ్చి, వొకే గమ్యానికి, వొకే మార్గంలో ప్రయాణం చేస్తాయి. ఆ మార్గంలో పెద్ద మార్కెట్టు, మూడు సినిమాహాళ్ళు, రెండు కాలేజీలు వున్నాయి. ఆ మార్గం ఆవూరికి వూపిరితిత్తి.

అందుకే ఆ సెంటరుకు ఎవరు ముందొస్తారన్నది ఎనిమిది, పదో నెంబర్ల మధ్య ఎప్పుడూ పోటీనే!

"వొరేయ్ లక్ష్మణా! పదో నెంబ రొస్తోంది. పేసెంజర్లని బేగ క్కించు." కనకారావు యింజన్ స్టార్టు చేస్తూ అరిచాడు.

సెంటర్లో పోలీసుకు ప్రదక్షిణంచేసి వస్తున్నపదోనెంబరు బస్సును, డ్రైవ్ చేస్తున్న వెంకట్రావును చూచి కనకారావు గతుక్కుమన్నాడు.

అ వూరి సిటీ బస్సు డ్రైవర్లలో కనకారావుకు రేష్ డ్రైవర్‌గా పేరుంది. అతనొకప్పుడు జి. టి. రోడ్డుమీద లారీలు డ్రైవ్ చేసేవాడు. యినపగుండె. కాస్త మందుపుచ్చుకొంటే మరి చెప్పనక్కర్లేదు! అందుకే కనకారావు ఎనిమిదో నెంబరు బస్సుకు పెద్ద ఆస్తి. మిగతా డ్రైవర్లు ఎన్ని పోటీలుపడినా కనకారావుతో పోటీకి మాత్రం సాహసించరు. సాహసించినా, గెలవగలిగినా, సత్తా వున్నవాడు వెంకట్రావు వొక్కడే.

అయితే వెంకట్రావు పెద్దమనిషిగా పేరు పొందేడు, అనవసరపు పోటీలకు పోడు. నిక్కచ్చి మనిషి. టైం అంటే టైమే. ఆవేశ కావేశాలు పెంచుకొని గొడవలు పెట్టుకోడు. అందుకే డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్లు అతనంటే గౌరవిస్తారు. కానీ బస్సు యజమానులు మాత్రం ఎవరూ అతన్ని నాలుగేళ్ళు తమ దగ్గర వుంచుకోరు. పెద్దమనిషి తరహా సిటీ బస్సు డ్రైవర్లకు - అందులోనూ అవూర్లో పనికిరాదని వారి నమ్మకం. అందుకే వెంకట్రావ్ అన్ని రూట్లలోనూ పని చేశాడు. పదో నెంబరుకు

కూడా యీ మధ్యే వచ్చాడు.

కనకారావు కూడా వెంకట్రావును గౌరవిస్తాడు. అభిమానిస్తాడు. అయితే డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాక స్నేహబంధాల్లాంటివి పెట్టుకో కూడదని అతను డ్రైవరుగా నేర్చుకొన్న మొదటి పాఠం.

అందుచేత వెంకట్రావుతో "టైం తగాదా" పెట్టుకోవాలా, వద్దా అని వొక్క క్షణం ఆలోచించినా, బాధ్యతను గుర్తు తెచ్చుకొని బస్సును స్టార్టు చేశాడు.

నిజానికి ఆ సెంటర్నించి పదో నెంబరు ముందువెళ్ళాలి. పదో నెంబరు కండక్టరు బస్సును ఆపి అదే చెప్పేడు. కానీ కనకారావు అప్ప టికే బస్సును తీసికెళ్ళి మెయిన్ రోడ్డు మొదట్లో నిలిపేడు.

ఆ వూరి మెయిన్ రోడ్డులో గొప్ప విలక్షణత్వంవుంది. వొక బస్సో, కారో ఆ రోడ్డులో ప్రవేశిస్తే మరో బస్సో కారో ఎదురురావటానిక్కాని, వోవర్ టేక్ చేసి పోవటానిక్కాని వీల్లేని విధం. ప్లాను చేసి నిర్మించారు. దానికితోడు అన్ని ముఖ్యమైన షాపులు అక్కడే వుండటం చేత నేల యీనినట్లు వుంటారు జనం. ముష్టివాళ్ళు, చిలక జోస్యాలవారు, మూలికల వారు. తాయెత్తుల వారు. బనీన్లు అమ్మేవారు, మిరపకాయ బజ్జీల బండ్లు.... యిత్యాదివన్నీ ఆ రోడ్డులోనే బిజినెస్సు చేస్తుంటారు.

పదో నెంబరు బస్సులో ఆ రోజు కాలేజీ యువతీ యువకులు ఎక్కువమంది వున్నారు. కండక్టరుతో పాటు వారూ ముందు పదో నెంబరే వెళ్ళాలన్నారు. లెక్కచెయ్యకుండా వెళ్ళిన కనకారావుమీద కోపం వచ్చింది. పట్టుదల పెరిగింది. వెంకట్రావును వుబ్బగొట్టేరు. జయ జయ ధ్వానాలు చేశారు.

వుబ్బగొడ్తే పరమాత్మే లొంగిపోయి వరాలిస్తాడు. యిక వెంకట్రావు వొకలెక్కా ? పైగా వుబ్బగొడ్తున్నది కుర్రాళ్ళు. అతనికి చదువుకొనే కుర్రాళ్ళంటే మనసులో మహాప్రేమ.

వెంకట్రావు వుబ్బిపోతే పట్టుదల పెరుగుతుంది. తనని తాను మర్చిపోయి త్రివిక్రముడవుతాడు. అప్పుడు డ్రైవింగ్‌లో అతని ఎదుట ఆ కృష్ణ పరమాత్మ కూడా నిలవలేడు.

పదోనెంబరు బస్సు స్టార్టింగ్‌లోనే వేగాన్ని పుంజుకొంది. ఏకధాటిగా యిరుకురోడ్డులో రాకెట్టులా దూసుకుపోసాగింది.

అంతకుముందు పోయిన ఎనిమిదో నెంబరు బస్సు కొన్ని గజాలు దూరంపోయి బ్రేకుపడింది. కార్లు, రిక్షాలు రోడ్డుపొడుగూతా బారులుతీర్చి నిలబడి వున్నాయి. ట్రాఫిక్ స్తంభించివుంది. కాలుస్తున్న బీడీని విసిరేసి, కాండ్రించి వుమ్మేస్తూ, "ఛ.... ఎదవనాయాళ్ళు" అని చిరాకుపడ్డాడు కనకారావు.

ట్రాఫిక్ క్లియర్ అయి బస్సు కాస్తంతదూరం పోయేసరికి పదోనెంబరు వెనక్కి రానేవచ్చింది. అది వచ్చిన వూపునుచూచి ముందు కాస్తంత బెదిరినా సమవుజ్జీతో పోటీ కనుక సంతోషించాడు. "అచ్ఛా" అనుకొని కొత్త బీడీ వెలిగించాడు.

ముందు ఎనిమిదో నెంబరు -

దొంగను వెంబడిస్తున్న పోలీసులా వెనుక పదోనెంబరు-

వెంకట్రావు "సైడ్" తీసుకోవాలని ఎంత ప్రయత్నించినా, కనకారావు బస్సును అడ్డం పెట్టూ విఫలంచేస్తున్నాడు. రెండుబస్సుల్లో పాసెంజర్లకి హుషారు పెరిగింది. శివం ఎత్తినట్లు కేకలేస్తున్నారు, చప్పట్లు కొడ్తున్నారు, బస్సు బాడీని బాదుతున్నారు.

రేసుగుర్రాల్లా పోతున్నాయి రెండు బస్సులు. రేసును చూస్తున్నవారిలా రోడ్డుమీద జనంకూడా హిస్టీరియా పేషంట్లు అయ్యారు.

పోటీ ప్రారంభమయ్యాక వెంకట్రావుకు పట్టుదల పెరిగింది. పిచ్చెక్కిపోయాడు. స్పీడు మరికాస్త పెంచాడు. ఖైదీ తప్పించుకుపోతే

జైల్లో సైరన్ అరిచినట్లు కారు హారన్ మోగుతోంది. బెదిరిన మేకల్లా రోడ్డుమీద జనం పక్కలకు తప్పుకుంటున్నారు. రోడ్డుపైనున్న కొట్లు పుట్‌పాత్‌ల పై కెక్కేయి.

పదోనెంబరు, ఎనిమిదో నెంబరు పక్కకొచ్చింది. జమిలిగా యిరుకు రోడ్డున పరుగెత్తుతున్నాయి. కొద్ది పొరపాటు జరిగితేచాలు రెండు బస్సులూ గుద్దుకొంటాయి. కొన్ని వందలమంది హరీ అనాల్సిందే !

కనకారావుకు భయం వేసింది. చేతులు చల్లబడ్డాయి. కాలు వణికింది. బండి స్లో చేశాడు.

వెంకట్రావు బండిని ముందుకు శరవేగంతో దూకించాడు. బస్సులో పాసెంజర్లు వెంకట్రావుకు జయ జయ ధ్వానాలు చేశారు.

కానీ...

అంతలోనే వెంకట్రావు కళ్ళు తిరిగేయి. ఆ కుర్రాడు. అరె ! .... అదేమిటి ? రోడ్డు కడ్డంగా ...

అరె ! వాడు - ఆ కుర్రాడు....

వెంకట్రావు కళ్ళముందు తెల్లటి తెరలు. అ తెరలమీద యమధర్మ రాజు బొమ్మలు.

వెంకట్రావు కళ్ళు మూతలు పడ్డాయి. కాళ్ళు అనుకోకుండానే బ్రేకుని గట్టిగా నొక్కిపట్టేయి. అతను స్టీరింగ్ చక్రంపై వాలిపోయాడు.

వూరు వులిక్కి పడేలా ఆక్రందన చేస్తూ ఆగింది పదోనెంబరు బస్సు !

నేల చీలి ఎర్రటి రక్తాన్ని వెదజిమ్మింది !

* * *

ఫస్ట్‌క్లాస్ మునిసిఫ్ మేజస్ట్రేట్ మధుసూధనరావుమాట కాస్తంత పెళుసు. అయినా మనసు మహా మెత్తన. అతని తీర్పులు సూటిగా, నిక్కచ్చిగా వుంటాయి.

అతను అన్నీవున్న కుటుంబంలో పుట్టేడు. అందం, మంచి మనసు తప్ప మరేమీలేని సుశీలను ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాడు.

పెళ్ళయి పుష్కరం దాటినా యివాళిటికీ వాళ్ళ దాంపత్యాన్ని చూచి కొత్త దంపతులుకూడా అసూయపడాల్సిందే. అంతగా కల్సిపోయారిద్దరూ.

అన్నీ వున్నా పిల్లలు లేని లోటును ఏ వైద్యశాస్త్రం తీర్చలేక పోయింది. ముష్టిపిల్లలు యింటి ముందుకొస్తే మురిపెంచేస్తుంది సుశీల. "పిల్లలు కలవాడిని దయ చూపండి బాబూ!" అంటే చాలు సహాయ పడ్తాడు మధుసూదనరావు. వొకరి కొకరి వోదార్పు, పరస్పర అనురాగం-వారి జీవితాల్లో భాగాలయ్యాయి.

కోర్టు నుంచి మధుసూదనరావు యింటికొచ్చాక జడ్జిమెంటు రాసు కోవాల్సిన పనివుంటే తప్ప ఆమెను వదలడు. నవ్వుతూ మాట్లాడాల్సిందే.

అటువంటిది భర్త మూడురోజులుగా అదోలా వుండటం సుశీల గమనిస్తూనేవుంది. కానీ, కోర్టు వ్యవహారాల్లో ఆమె కలిగించుకోదు. విశే షాలేమైనా వుంటే అతను చెప్పాల్సిందే. సర్దా కబుర్లయితేనే చెప్తాడు అతను.

"ఏమిటి మధూ! అలాగున్నావు?"

మధుసూదనరావు కూడా భార్యకు ఎలా చెప్పటమా అనే ఆలో చిస్తూన్నాడు.

"అన్యాయానికి సాక్ష్యాలనే చక్కెర పూతలు పూసి మాచేత తిని పించటానికి ప్రయత్నిస్తున్నారా ప్లీడర్లు! నిర్దోషుల్ని దోషులుగా మార్చ టానికి చట్టాలకే నల్లటి ముసుగు కప్పుతున్నారు"

యిలాంటి సంఘటనలు భార్యతో చాలా చెప్పేడు మధుసూదనరావు. అలాంటి తెలివి తేటలు గల న్యాయవాదుల్ని తను ఎలా చిత్తుచేసిందీ వర్ణించకపోలేదు.

కానీ, యివాళ తీర్పు యివ్వాల్సిన కేసు అలాంటిది కాదే ?

"శిక్షాస్మృతి సెక్షను 304 ఎ కింద పోలీసులు వెంకట్రావు అనే ఓ డ్రైవరుమీద బస్సు రేష్‌గా డ్రైవ్ చేసి ఓ వ్యక్తి చావుకు కారణమైనట్లు కేసు పెట్టేరు. ముద్దాయి నేరాన్ని అంగీకరించాడు."

తన మాటలు తనకే చేదుగా విన్పించి ఆగేడు మధుసూదనరావు. జరిగిన విషయాన్ని చెప్పాల్సిన పద్ధతి యిదికాదు అనిపించింది.

"మరింకేం ? యీ ఆలోచన, యింత బాధ దేనికి ?"

ఎందుకో....సుశీల కెలా చెప్పటం ?

"జడ్జిబాబూ ! తప్పులన్నీ వొప్పుకొంటున్నా. అన్నిటికన్నా పెద్ద తప్పు పేదోడుగా పుట్టటం. నాకు వురిశిక్ష వేయండిబాబూ ! యీ బాధ నుంచి నన్ను రక్షించండి. చచ్చి మీ కడుపున పుట్తాను. మీ పిల్లా పాపలకు మేలు జరుగుతుంది."

వెంకట్రావు మాటలు, రూపం తలుపుకొచ్చినంత మాత్రానే మధుసూదనరావు కళ్ళవెంట నీళ్ళు కారసాగేయి.

"ఛ. ఛ అదేమిటి మధూ ! కోర్టులో కేసు తల్చుకొని కన్నీళ్ళు కారుస్తున్నావా ?" సుశీల వోదార్చబోయింది.

నిజంగా అతనిపట్ల జాలివుంటే మరణశిక్ష విధించాలి. కాని అందుకు చట్టం అంగీకరించదు. నిర్దోషిగా నిర్ణయించి వదిలేయటం రెండో మార్గం. కానీ అది న్యాయాన్ని సమాధి చేయటమే అవుతుంది.

అప్పటికీ మధుసూదనరావు తరచి తరచి చాలాసార్లు అడిగేడు.

"చావటం కోసమే నేరాన్ని వొప్పుకుంటున్నావుకదూ ? నిజానికి నీ తప్పేంలేదు. ఆ కుర్రాడే రోడ్డు కడ్డంగా పరుగెత్తేడు. అవునా ?"

"లేదుబాబూ ! చచ్చినవాడిని నేరస్తుడిని చేయకండి. వాడి నేరం వొక్కటే. వొక్క లడ్డుండ కొనిపెట్టలేని చవటకడుపున పుట్టటం."

కాలేజీ విద్యార్థులు, కనకారావు లంచ్ టైమ్‌లో చాలాసార్లు చెప్పేరు-తామే వెంకట్రావును రెచ్చగొట్టేమని, తప్పు అతనిదికాదు తమదేననీ.

కానీ, వెంకట్రావు దేనికీ అంగీకరించందే. అన్ని బాధ్యతలూ దోషాలూ తనవేనని విస్పష్టంగా చెప్తుంటే సాక్షులు, విచారణలకు చోటెక్కడ ?

యిక మిగిలింది ఒక్కటే మార్గం. చట్టప్రకారం జైలుశిక్ష, జుల్మానా.

కానీ, వెంకట్రావుపాలిట అది చిత్రవధ ! దారుణ హింస !

"నేను చెయ్యలేను సుశీ ! ఆ పని నేను చెయ్యలేను."

సుశీలకేమీ అర్థం కాలేదు. అయినా ధైర్యం యిస్తున్నట్లు అంది.

"నువ్వు చేసేదేమిటి మధూ ! నిమిత్తమాత్రుడివి. అసలు నువ్వెరివట ?"

"వేదాంతం చెప్పకు సుశీ ! నేనెవరినా ? పిల్లలులేని తండ్రిని ! పిల్లలకోసం తపించిపోయే ఓ స్త్రీమూర్తి భర్తను ! ఒకే ఒక్క కొడుకును తన నిర్లక్ష్యానికి బలి పెట్టుకొన్న తండ్రి మానసిక స్థితిని గ్రహించ లేనంటావా ? ఆ అనుభవం పగవాడికి కూడా వద్దు."

"అసలు విషయం చెప్పకుంటే నీబాధ నాకెలా తెలుస్తుంది మధూ !"

అప్పుడు కేసు చెప్పేడు. చివరికన్నాడు-

"డ్రైవరు వెంకట్రావు బస్సు కింద పడి చనిపోయిన కుర్రాడు, అతని కొడుకు చిట్టిబాబే సుశీలా !"

* * *

ఆ వేళ జడ్జిమెంటు యిచ్చే రోజు-

"ట్రాఫిక్ రూల్సు పాటించండి బాబూ ! లేకపోతే మోసపోతారు?" కనకారావు కన్పించిన వాళ్ళందరితో చెప్తున్నాడు. స్టూడెంటు కుర్రాళ్ళు నీళ్ళుపోసిన నిప్పుల్లా జడ్జిమెంటు కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు.

"ముద్దాయి వెంకట్రావు నేరస్తుడు. అతని అశ్రద్ధకు, అలక్ష్యానికి జుల్మానా పడింది...."

అంతవరకూ వింటూనే వుత్సాహంతో అరిచేరు స్టూడెంట్సు. "ఆ డబ్బు మేంకట్తాం" అంటూ ముందుకొచ్చారు. కానీ జేబులో డబ్బేదీ?

"మీ నైతిక బాధ్యతను డబ్బుతో తుడిచేసుకోంటేపోదు ఫ్రెండ్స్. ట్రాఫిక్ నిబంధనల్ని పాటించండి. ఉల్లంఘించే వార్ని దుపులో పెట్టండి. వెంకట్రావు కట్టాల్సిన ఫైన్‌ను మధుసూధనరావు అనే వ్యక్తి కోర్టుకు కట్తాడు."

అంతటితో కథ అయిపోయిందనుకొని జడ్జీకి జేజేలు పలకబోయారు కుర్రాళ్ళు.

"ఆర్డర్ .... ఆర్డర్ ...."

మధుసూదనరావు మొహంలో గాంభీర్యం. కళ్ళు ఎదట బల్ల మీద వున్న జడ్జిమెంటు కాగితాల్లోకి దూరేయి. మళ్ళీ నిశ్శబ్దం. కనకారావు గుండెలు వేగంగా కొట్టుకొంటున్నాయి.

"చట్టప్రకారం నేరస్తుడికి జైలు శిక్ష విధించాలి. కానీ, చేతులారా కొడుకును చంపుకోటంకన్నా పెద్ద శిక్ష ఏముంది అతడికి ? నేరస్తుడు ఆ క్షణంలోనే చనిపోయాడు. సొసైటీకి అతడిని బతికించే బాధ్యత వుంది. అందుచేత అతడిని సొసైటీకి అప్పగిస్తున్నా."

కోర్టు లంచికి లేచింది.

"వెంకట్రావ్ ! నీకు స్వేచ్ఛదొరికింది. యింకా ఎందుకా బోనులో నిలబడ్డావ్ ? నీ భార్యా, పిల్లలూ...." అంటూ వెంకట్రావుని సమీపించి

"వెంకట్రావుకు ముక్తి వచ్చింది సార్ ! కొడుకు దగ్గరి కెళ్ళి పోయాడు" అని పిచ్చికేక వేశాడు కనకారావు. ఛేంబర్‌లో వున్న మధు సూదనరావు వులిక్కిపడ్డాడు.

*　　*　　*

"యింకా జడ్జిమెంటు రాయటం పూర్తికాలేదా మధూ !" మగత నిద్రలోనుంచి బద్దకంగా లేచింది సుశీల. భర్త దగ్గరికొస్తూ అతని కుర్చీ చుట్టూవున్న కాగితపువుండల్ని చూచి విషయం గ్రహించింది.

"యిప్పటిదాకా నా ఆలోచనలు రాంగ్‌సైడ్‌లో నడిచేయి సుశీ ! ట్రాఫిక్ నిబంధనల్లాగా చట్టపు నిబంధనల్ని అతిక్రమించకూడదు. కొత్త ఆలోచనవచ్చింది. ఒక్క క్షణం ఆగు."

అంతవరకు రాస్తువ్న జడ్జిమెంటు కాగితాన్ని నలిపి వుండచేసి, మరోకాగితంమీద ఏదో రాసి, రాసిన కాగితాన్ని భార్యకందిస్తూ అన్నాడు.

"జడ్జిగా చేయలేనిపనిని అడ్వొకేటుగా వుండి చేయగలనేమో ప్రయత్నిద్దామనీ...."

"దిస్ యీజ్ కరెక్ట్ జడ్జిమెంట్" అంది సుశీల ప్రేమగా

(విజయ - మే 1977)